భగత్‌సింగ్‌కు ఘనంగా నివాళి



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్–2 బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో సాహిద్ భగత్‌సింగ్ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ సీనియర్ నాయకులు అడదికే రాజు, బొమ్మరాజు నర్సింహ, నెరుట్ల జగన్, చేడం వెంకటరమణగుప్తా, రామారావు, కిరణ్, శేఖర్, చంద్రశేఖర్, సోఫన్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అమ్మవారి మహా హారతి



అమ్మవారికి మహా హారతిని ఇస్తున్న నిర్వాహకులు

మైలార్‌దేవ్‌పల్లి: దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాజేంద్రనగర్ బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయంలో ఆదివారం మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ హారతి కార్యక్రమానికి స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రతి రోజు అమ్మవారిని వివిధ రూపాలలో ముస్తాబు చేసి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ఆదివారం మహా చండికా కాళీదేవిగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులతో దేవాలయం కిటకిటలాడింది.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేసిన మాజీ ప్రజాప్రతినిధులు

మణికొండ: దసరా పండగను అందరూ సుఖసంతోషాలతో ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని నార్సింగి మున్సిపల్ మాజీ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ లంకల పాపిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల వార్డులలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు దసరా కానుకగా వారు కొత్త దుస్తులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం ప్రజాశ్రేయస్సుకు కష్టపడే కార్మికులకు ప్రతి సంవత్సరం తమ వంతు భాధ్యతగా దుస్తులను పంపిణీ చేస్తున్నామన్నారు.

గుండెను పదిలంగా ఉంచుకోవాలి

లంగర్‌హౌస్: ప్రతి ఒక్కరూ మానసిక, శారీరక వ్యాయామాలు చేస్తూ గుండెను పదిలంగా ఉంచుకోవాలని ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా రెనోవా ఆస్పత్రి ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌లో ఆదివారం 3కె మారథన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రెనోవా ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ శివకుమార్, డాక్టస్ నగేష్‌తో కలిసి మారథన్ ప్రారంభించారు. బాపూఘాట్‌లో మారథన్ ముగిసిన అనంతరం వైద్యులు మాట్లాడుడూ.. వ్యాయామం వారంలో ఐదు రోజులు చేస్తూ మానసిక ప్రశాంతతతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏసీపీ జగ్గారావు, జీఎం డాక్టర్ జబి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

బాధితులకు 'భరోసా'

- లైంగిక దాడులు.. పోక్సో కేసుల పరిష్కారం దిశగా...
- అన్ని విధాలా చేయూత ఇచ్చేందుకు సన్నద్ధం

శంషాబాద్‌లో ప్రారంభానికి సిద్ధమైన భరోసా కేంద్రం



శంషాబాద్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భరోసా కేంద్రం

శంషాబాద్: లైంగిక దాడులు.. పోక్సో కేసుల బాధితులకు అండగా నిలిచేందుకు శంషాబాద్ పట్టణంలో భరోసా కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. పోలీసు శాఖ.. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పనిచేసే ఈ కేంద్రం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మూడోది. పట్టణంలోని డీసీపీ కార్యాలయం సమీపంలో నిర్మించిన నూతన భవనంలో భరోసా కేంద్రం కొలువుదీరనుంది. బాధితులకు సత్వర పరిష్కార మార్గంతో పాటు తక్షణమే సాంత్వన కలిగించేందుకు భరోసా కేంద్రం పనిచేస్తుంది.

సాయం ఇలా...

లైంగిక దాడుల, పోక్సో కేసుల్లో పోలీసులను ఆశ్రయించిన బాధితులకు భరోసా కేంద్రం వెన్నంటి నిలుస్తుంది. వారికి వైద్య సాయంతో పాటు వారి మానసిక స్థితిని పరిశీలించి కౌన్సిలింగ్ ఇస్తుంది. కేసు నమోదు తర్వాత ఇంటికి చేరుకోలేని వారికి సఖీ కేంద్రాల్లో ఆశ్రయం కల్పిస్తుంది. బాధితులకు ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సాయాన్ని కూడా కల్పిస్తుంది. కేసు మొదటి దశ నుంచి న్యాయస్థానంలో ట్రయల్ జరిగే వరకు బాధితులకు సహాయకారిగా భరోసా కేంద్రం నిలుస్తుంది. ఇందుకోసం భరోసా కేంద్రంలో మానసిక నిపుణులు, ప్రాథమిక వైద్యులు, న్యాయ పరిష్కారం చేసే నిపుణులు అందుబాటులో ఉంటారు.

శంషాబాద్ భరోసా కేంద్రం పరిధిలో...

శంషాబాద్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భరోసా కేంద్రం పరిధిలో శంషాబాద్ డీసీపీ జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లు, రాజేంద్రనగర్ డీసీపీ జోన్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, మొయినాబాద్, చేవెళ్ల, షాబాద్ పోలీస్ స్టేషన్లు మాత్రమే వస్తాయి. ఇక్కడ నమోదైన లైంగిక దాడులు, పోక్సో కేసుల సమస్యల పరిష్కారానికి భరోసా కేంద్రం అండగా నిలుస్తుంది.

ఆశ్రయం కల్పిస్తూ అండగా...

లైంగిక దాడులు, పోక్సోగా నమోదైన బాధితులకు భరోసా కేంద్రం అండగా నిలుస్తుంది. వారి మానసిక స్థితిని మెరుగుపర్చడంతో పాటు వైద్యసాయం, ఆశ్రయం కల్పిస్తుంది. ప్రభుత్వం నుంచి రావల్సిన ఆర్థిక సాయాన్ని అందజేస్తుంది. ఇందుకోసం భరోసా కేంద్రంలో బాధితులకు సహకరించే సిబ్బంది, ఉద్యోగులు ఉంటారు. శంషాబాద్ భరోసా కేంద్రం వారం రోజులుగా ట్రయల్‌గా నడుస్తోంది. అధికారికంగా ప్రారంభం చేయాల్సి ఉంది.

– సృజన, డీసీపీ ఉమెన్స్ అండ్ సెఫ్టీ వింగ్

మార్షల్ ఆర్ట్సలో సత్తాచాటిన క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ చాంపియన్‌షిప్ పోటీలు మహబూబ్‌నగర్ జిల్లా నెల్లికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నిర్వహించారు. ఇందులో మైలార్‌దేవ్‌పల్లి మహవీర్ మార్షల్ ఆర్ట్స్ ఉషు అకాడమీ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభకనబరిచి నేషనల్స్‌కు సెలక్ట్ అయ్యారు. గోరిగే శ్రీశాంత్ అండర్–17 కేటగిరీలో గోల్డ్ మెడల్ సాధించి అక్టోబర్ 28వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు జమ్మూకశ్మీర్ శ్రీనగర్‌లో జరిగే నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. అలాగే వి.భరత్ అండర్–19 కేటగిరిలో 48 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి మణిపూర్ ఇంఫల్‌లో నవంబర్ 4వ తేదీన జరిగే నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే కానికే సాయిచరణ్ సిల్వర్ మెడల్, అందుగుల జయవర్ధన్ బ్రొన్జ్ మెడల్, బండ సాయికృష్ణయాదవ్ బ్రొన్జ్ మెడల్, ఎ.కార్తీక్‌లు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అభినందించి రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభకనబరిచి పతకాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్ ఎం.సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు



మన్‌కీబాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తలపెట్టిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం బీజేపీ మహిళామోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.వనితారెడ్డి స్వగృహంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, బీజేపీ యువమోర్చా నాయకులు బొక్క బాల్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మూర్చా రాష్ట్ర నాయకులు డి.సత్యనారాయణ ముదిరాజ్, దళితమోర్చా రాష్ట్ర నాయకులు కొరని సదానందం, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్, కొత్త సోల్కర్‌రెడ్డి, మన్‌కీ బాత్ కన్వీనర్ మల్లేష్‌చారి, సులిగే విఠల్, గడిల పద్మావతి, సరితారెడ్డి, వాసు, శ్రీకాంత్ రెడ్డి, బాలకృష్ణ, పవన్, యాదయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో 'ఆరోగ్య భారత్'



అలకాపూర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

మణికొండ: ప్రతి ఒక్కరూ తమ దిన చర్యలో యోగాను భాగస్వామ్యం చేసుకుంటే పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని భారతీయ యోగా సంస్థాన్ జిల్లా అధ్యక్షుడు వర్దన్ నాయక్ అన్నారు. నిత్యం కనీసం అరగంటపాటు యోగా చేయాలన్నారు. ఆదివారం యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించే క్రమంలో అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్క్ నుంచి యోగా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ యోగాను సాధ్యన చేస్తే దేశం ఆరోగ్య భారతంగా తయారు చేయవచ్చన్నారు. మణికొండలో నేతాజీ పార్క్, ఎంజీ పార్క్, చిత్రపురి, స్టైలా అపార్ట్‌మెంట్‌లలో ఉదయం ఉచితంగా యోగాను నేర్పుతున్నామన్నారు. పలు బ్రాంచ్ ఇంచార్జిలు సుగుణ, కుసుమ, ప్రసాద్, విజయసింహ, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఉప కమిషనర్ సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రూ. 1.26 కోట్ల మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

శంషాబాద్: కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు (సీఐఎస్‌ఎఫ్) విద్యార్థులకు డీజీ మెరిట్ స్కాలర్ షిప్ కింద 2024–25వ విద్యాసంవ్సరానికి రూ. 1.25 కోట్లు పంపిణీ చేసినట్లు సీఐఎస్‌ఎఫ్ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి అజయ్‌దహియా తెలిపారు. డీజీ మెరిట్ స్కాలర్‌షిప్‌లో జరిగిన సంస్కరణల కారణంగా ఈ ఏడాది మొత్తం 569 మంది విద్యార్థులు మెరిట్ స్కాలర్ షిప్‌ను పొందారన్నారు. ఇందులో తొలిసారి క్రీడల్లో ప్రతిభకనబర్చిన వైదుగురికి, విధి నిర్వహణలో మృతిచెందిన వారి విద్యార్థులకు 8 మందికి కూడా స్కాలర్ షిప్ అందజేసినట్లు తెలిపారు. 12 తరగతిలో 80 నుంచి 90 శాతం మార్కులు వచ్చిన వారికి రూ. 20 వేలు, 90 శాతానికి పైగా మార్కులు సంపాదించిన విద్యార్థులకు 25 వేలచొప్పున ఇవ్వడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియ ఉంటుందన్నారు. పూర్తి పారదర్శకతతో విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

బతుకమ్మల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు



పెద్దతాళ్లకుంట చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సభ్యులు

అత్తాపూర్: హైదర్‌గూడలోని పెద్దతాళ్లకుంట చెరువు వద్ద బతుకమ్మల నిమజ్జనానికి సంబంధించి భారీస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీ ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోండ్ర నర్సింహ తెలిపారు. ఆదివారం బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లను సమాజం సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. బతుకమ్మల నిమజ్జనం సమయంలో భక్తులకు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, స్ట్రీట్ లైట్స్ విభాగం అధికారులు తగినన్ని లైట్లు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, కార్యదర్శి కొండమీది హరినాథ్, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, మోండ్ర కొమురయ్య, కార్యదర్శి సాబాద విజయ్‌కుమార్, బీట్కూరి సతీష్, సులిగే శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, కొంగళ్ల శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



టీఎన్‌జీవోస్ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విజయలక్ష్మిగా అమ్మవారు



దుర్గామాత పూజల్లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సమాజ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకం



కిస్మత్‌పూర్‌లో కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు



బాబుల్‌రెడ్డినగర్‌లో...

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లోని భగత్‌సింగ్ యోగా శాఖ బిజ్జు వెంకటేష్ యోగా శిక్షకులు ఆధ్వర్యంలో రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. విజయ దశమి పురస్కరించుకొని ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 170 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్, శాస్త్రవేత్త డాక్టర్ ఎ.వి.రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్‌ఎస్‌ఎస్ అంటే దేశ రక్షణ అని దేశ రక్షణకై ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న సేవలు ఎంతో అద్భుతమైనవన్నారు. సమాజ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకమన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ... దేశరక్షణకు ప్రాణాలను సైతం ఫణంగా పెట్టే వాళ్లు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలన్నారు. బీజేపీ రాష్ట్ర కన్వీనర్ అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి, నాయకులు మహాలింగంగౌడ్, ప్రశాంత్‌నాయక్, నీరుడు శేఖర్ ముదిరాజ్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

బాబుల్‌రెడ్డినగర్‌లో...

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ వందో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

1925లో డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ స్థాపించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్), దేశానికి 100 సంవత్సరాల సేవను పూర్తి చేసుకునే చారిత్రాత్మక మైలురాయిలకి ప్రవేశించిందని పలువురు పేర్కొన్నారు.

వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరం

చార్మినార్: మూసీ పరీవాహక ప్రాంతాల్లోని ముంపు బస్తీల బాధితులకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం మూసీ నదిలో వరద ఉధృతి తగ్గడంతో సహాయక చర్యలను ముమ్మరం చేశామన్నారు. జీహెచ్‌ఎంసీ ఆరోగ్యం, పారిశుద్ధ్య విభాగం అదనపు కమిషనర్ సీఎన్. రఘుప్రసాద్ తదితరులతో కలిసి ఆయన వరద ముంపునకు గురైన మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఆదివారం పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానికంగా ఉన్న ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, బురదను హైడ్రా, పారిశుధ్య విభాగాలకు చెందిన సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నార న్నారు. ఈ పర్యటనలో మలక్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇంకేషఫ్ అలీ, ఆరోగ్యం, పారిశుద్ధ్య జాయింట్ కమిషనర్ శంకర్, ఏఎంహెచ్ఓ డాక్టర్ రుద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.




హైదర్షాకోట్‌లో అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి



భుజిలీ మహంకాళిని దర్శించుకుంటున్న బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



శంషాబాద్ ధర్మగిరిలో మహాచండి అలంకరణలో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆయా మండపాలు, దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. దేవాలయాల్లో సామూహిక కుంకమార్చనలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఆయా పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొంటున్నారు. దేవాలయాల వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ముమ్మరంగా చేస్తున్నారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



తిరుమలహిల్స్‌లో చండీయాగంలో పాల్గొన్న హరీష్‌గౌడ్ తదితరులు



శంషాబాద్ కవ్వగూడలో పూజలు నిర్వహిస్తున్న స్థానికులు



హైదర్‌గూడ పోచమ్మ ఆలయంలో...

ఊరెళ్తున్నారా.. పారాహుషార్!

నార్సింగి ఏసీపీ జీవీ రమణగౌడ్



మణికొండ: దసరా పర్వదినాన్ని తమ సొంత ఊర్లలో.. బంధు మిత్రుల నడుమ నిర్వహించుకునేందుకు నగరవాసులు తమ స్వగ్రామాలకు తరలి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని తమ ఇళ్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు తాము సొంత ఊర్లకు వెళ్తున్నామనే సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని నార్సింగి ఏసీపీ జి.వి.రమణగౌడ్ సూచిస్తున్నారు. ఇందుకు సబంధించిన ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... తమ స్వగ్రామాలకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పండగకు అందరూ గ్రామాలకు వెళ్లటంతో తాళం కనిపించిన గృహాలలో చోరీలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. రాత్రి సమయంలో గస్తీలను పెంచి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజలు సైతం తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే పలు రోడ్లు, కాలనీలలో సీసీ టీవీలను ఏర్పాటు చేయటంతో వాటి ద్వారా పోలీస్‌స్టేషన్‌ల నుంచే పర్యవేక్షణ చేస్తామన్నారు. ప్రజలు తీసుకోవాల్సిన మరిన్ని జాగ్రత్తలను ఆయన ఇలా వివరించారు.

- ఊరికి వెళ్లే వారు తమ ఇంటి పరిసరాలను గమనించాలని పక్కింటి వారికి చెప్పాలి.
- విలువైన వస్తువులను బైక్‌లు, కార్లలో పెట్టవద్దని, వాటిని రోడ్లపై కాకుండా ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి. వాటికి హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్‌లు వేయాలి.
- బీరువా తాళం చెవిలను ఇంట్లో ఉంచవద్దు. తమతో పాటే తీసుకెళ్లాలి. పాలు, పేపర్ వారిని రావద్దని చెప్పాలి. పనిమనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలి.
- ఇంటికి తాళం వేసి అది కనిపించకుండా డోర్ కర్టెన్‌ను అడ్డుగా ఉంచటంతో పాటు ఇంట్లో ఒక లైటును వేసి ఉంచాలి. వీలుంటే టైమర్‌తో కూడిన లైట్లను అమర్చుకోవాలి.
- విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. బంగారం, నగదును లాకర్‌లలో భద్రపర్చుకోవాలి.
- తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌లను పోలీస్‌స్టేషన్‌లలో తెలపాలి. అలాంటి చోట్ల గస్తీ పెంచుతాం. ఇళ్లు, అపార్ట్‌మెంట్‌ల ముందుకు ఎవరైనా కొత్త వారు వస్తే వారి వివరాలను వాచ్‌మెన్‌లను పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి.
- నమ్మకమైన వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులనే నియమించుకోవాలి. వారి పూర్తి వివరాలను తీసుకోవాలి.
- ఇప్పటికే సీసీ కెమరాలు ఉన్నవారు తమ సెల్ ఫోన్‌లలో అపుడప్పుడు తమ ఇంటి పరిసరాలను చూసుకుంటూ ఉండాలి.
- లేనివారు తమ కాలనీలు, ఇళ్లు, పరిసరాలు, షాపులలో సీసీ కెమరాలను ఏర్పాటు చేసుకోవాలి.